# విలువెంత?

ఈ కోర్కె నిన్నటిదికాదు, యీనాటిది కాదు. ఇంచుమించు ఇరవ యేళ్ళనించీ తీరనికోర్కె యిది. ఈ గోడ గడియారాన్ని తన చిన్ననాటి మిత్రుడు సోమరాజు ఇంట్లో చూసిన నాటినించీ గజపతి ఇలాంటి గడియారం కావాలని కోరుకున్నాడు. ఆ గడియారం జపాను గడియారం. సంగీతం ఆలా పించినట్లు గంటలు కొట్టుంది.

ఆ రోజుల్లో గజపతికి గడియారం కొనుక్కునే స్థోమత ఉండేది కాదు. అలాంటి స్థోమత వచ్చేసరికి ఆ రకం గడియారాలు బజారులో లేవు. ఎన్నెన్నో గోడగడియారాలు కనిపించినా ఏవీ నచ్చేవి కావు. ఆ జపాను గడియారంమీద మోజుతో అప్పుడప్పుడు సోమరాజు ఇంటికివెళ్ళి అదేపనిగా దానివేపు చూసేవాడు. ఏనాడూ ఆగిపోయినట్లు చూడలేదు. ఈ గడియారం ఆగలేదుగానీ, ఈ గడి యారం తెచ్చిన గుండె ఆగిపోయింది. శ్యామసుందరి పోయాక సోమరాజు వెర్రివానిలా తిరిగాడు. ఉన్న ఆస్తంతా హారతికర్పూరంలా వెలిగించేశాడు. అతనిదగ్గర ఎన్నెన్నో సామాన్లు చౌగ్గా కొన్న గజపతి యీ గోడగడియారం అడిగినా సోమరాజు అమ్మటం లేదు. వాడు అమ్మనంటుంటే గజపతికి ఆవేదన హెచ్చవుతోంది.

"ఆ గడియారం మీద యెందుకు ఫట్టించారు!" అని అడిగింది చంద్ర వంక. గజపతికి రంగూ, రుచీ దాచుకున్న పచ్చని తమలపాకు ఈ చంద్రవంక.

"తెలియని వాళ్ళతో సంబంధంకన్నా తెలిసినవాళ్ళతో సంబంధం మంచిది కదా.... కొత్త గడియారం కొంటే బాగా పనిచేస్తుం దనెక్కడ?"

"పాతది పాడవదని వుందా?"

"ఇంచుమించు ఇరవయేళ్ళనించీ చూస్తున్నాను. ఒకనాడూ ఆగినట్లు గుర్తులేదు. ఇక విలువ కట్టు!"

"విలువలు కట్టడం నాచేతకాదు బాబో!" అనేసింది చంద్రవంక చంద్ర వంకలా నవ్వుతూ!

"నీ విలువకట్టే నేను కన్నెరికం చేశానే! విలువకట్టే నిన్ను నిత్యం నాదాన్ని చేసుకున్నానే! నువ్వు నా విలువలేని వజ్రానివి...."

ఊర్లో గజపతి మీసాలు మెలివేసిన మహారాజే! అతను కట్టిన విలువలను ఆమోదించినవాళ్ళే తనచుట్టూ వున్నారు. ససేమిరా కాదన్న సోమరాజు ఒకరోజు ఆ గోడ గడియారం పట్టుకొనే గజపతి ఇంటికి వచ్చాడు.

గడియారం అందుకుంటూ "ఎంతివ్వాలి?" అని అడిగాడు గజపతి.

"దీనికి విలువ కట్టలేవు!"

"అయితే ఎందుకు అమ్ముతున్నావ్?"

"అవసరం."

పది రూపాయలనోటు యిస్తే తీసుకుని వెళ్ళిపోయాడు. తన పడక గదిలో కాళ్ళవేపు గోడకు గట్టిమేకును కొట్టి, గడియారాన్ని తగిలించాడు. అది 'టిక్ టిక్' మంటుంటే తన గుండెల్లో ఇదివరకు వినిపించని శబ్దాలేవో ఇప్పుడు వినిపిస్తున్నాయ్. గంటలు కొట్టగానే గిలిగింతలు పెట్టినట్లుంది. ఆ రాత్రి పరుపుమీద జారబడి అలా గడియారం వేపు చూస్తుంటే .... ఆ పెండ్యులం కదలిక .... ఆ ముళ్ళ కదలిక .... తన మనసూ కదిలింది. ఈ గడియారం మీద ఆనాడు కోరిక పుట్టకపోతే తను ఇంత గడించ గలిగేవాడా? తన జీవితంలో పెళ్ళాడాలన్న కోరిక కలగకుండానే తన తండ్రి పెళ్ళి చేసేశాడు. తన తండ్రి గతిలేక ఊర్లోనే వియ్యమందాడు. అందుకే తన బతుకు కయ్యాలపాలైంది. అసలు ఆ గోడ గడియారం మీద ఇంత మమకారం పుట్టడానికి కారణం తనుకాదు. గడియారమే చెప్తున్నట్లు టిక్ టిక్ మంటోంది. సోమరాజు పెళ్ళాం శ్యామసుందరి. తొలిసారి ఆమెవేపు చూసినప్పుడే అనిపించింది-నిగనిగలాడే వయసుతో ధగధగ లాడే సుందరి. శ్యామవర్ణంతో లోకాన్నే మోహింపజేసే మోహిని. సిగలో దోపిన గులాబుల్లా నున్న పెదిమలపై రెక్కలున్నా తను వాలలేక పోయాడు. అతని రెక్కలు రాలిపోలేదు. గులాబీ రాలిపోయింది. అందుకోలేనంత యెత్తుకు

శ్యామసుందరి యెదిగిపోయింది. మేఘాలను అందుకోతగ్గ మంచిని సాధించిందేమో, అందుకే మేఘాల చాటుకు పోయింది. బతుకు కయ్యాలపాలు చేసిన తన పెళ్ళామూ చచ్చింది. ఈ చంద్రవంక—శ్యామసుందరినీ మరిపించే చంద్రవంక—బంతులాడి అత్తయింటి కోడలు కాకండనే, సిగ్గుతో అజ్జలను శిరసావహించ కండానే గజపతి యిల్లాలిగా వూర్లో చలామణీ అయిపోతోంది. ఇంట్లో గడియారం కాదు—శ్యామసుందరే వచ్చినట్లుంది. ఇన్నాళ్లూ అణచుకున్న వూహ విప్పి నిట్టూర్చి నిద్దరపోయాడు. అందుకే యీ రాత్రి చంద్రవంక యింటికి వెళ్ళలేకపోయాడు.

తెల్లవారి లేచేసరికే అంగట సోమరాజు కూర్చొని వున్నాడు. గజపతిని చూడగానే—

"నీ పదిరూపాయలు నువ్వు తీసుకో—నా గడియారం నాకిచ్చే" అన్నాడు.

"అదెలాగవుతుంది?"

"నా శ్యామను నీ యింటో పెట్టుకోకు. అది లేకపోతే బ్రతకలేను."

గజపతి ఫకాలున నవ్వి "అది నీ పెళ్ళామా? గడియారం. పాత గడియారం. తాకట్టు పెట్టలేదు. అమ్మేశావు. తిరిగెలా వస్తుంది?"

"అది తెచ్చిన సామానులన్నీ అమ్మగలిగాను. ఇదొక్కటే కదిలే వస్తువు. నా శ్యామ ఆగిపోయిన గుండెలో శబ్దాలను యిందులో వదిలిపోయింది. నీకు పుణ్యం వుంటుంది. నా గడియారం నాకిచ్చే"

"నీకేం పిచ్చిగాని పట్టిందయ్యా! ఆగిన గుండె యేమీ మిగల్చదు. బుగ్గికూడా మిగలదు. బతికి చెడిన వాడివి. కావలిస్తే యింకో పదిరూపాయలు తీసుకో గానీ— ఈ గడియారం మళ్ళీ ఆ గోడ దిగదు" అంటూ అక్కడనించి వీధిలోనికి వెళ్ళాడు.

చంద్రవంకతో రాత్రి రానందుకు సంజాయిషీ చెప్పుకుని, అణచలేని వలపును చూపిస్తుంటే.

"ఇదేమిటి? పట్టపగలే యీ వెర్రి?" అంది.

"పేదరికంలో డబ్బుకున్న విలువ దేనికీ లేదనుకున్నాను. ఇంత గడించాక ఛీ విలువలేనిది యీ డబ్బే అనుకుంటున్నాను. కానీ నీవో—ఈనాడూ, ఆనాడూ, యేనాడూ విలువైనదానవే!''

"అదేమో బాబూ! విలువలు కట్టడం నాచేతకాదు.''

రెండోనాటి రాత్రి చంద్రవంక యింటినించి తిరిగి వచ్చేసరికి గడియారం గంటలు కొట్టింది. రాత్రి పన్నెండు. నిద్దర పట్టలేదు. ఇప్పుడు శ్యామసుందరి మీదకాదు గడియారంమీదే మమకారం హెచ్చవుతోంది. గదిలో యిప్పుడు తానొక్కడే లేడు. తియ్యని పిట్ట అరుస్తున్నట్లు గంటలు కొట్టింది. ఇప్పుడు

పరుగెత్తుతూన్న కాలాన్ని తన అరచేతిలో పెట్టుకున్నట్లు, పారే సెలయేటికి అడ్డుగా గోడకట్టి, గొట్టాలద్వారా నీరు వదుల్తున్నానని మురిసిపోతున్నాడు.

వేకువ ఝాము, లేచి వరండాలో కాలు పెట్టేసరికి కాళ్ళకు యేదో తగిలింది. ఒక్కసారి తృళ్ళిపడ్డాడు, ఏ పామో, తేలో, జెర్రో అనుకొని టార్చిలైటువేసి చూస్తే పదిరూపాయల నోటు. ఇంకెవరు పడేస్తారు? గడియారం తిరిగి యివ్వలేదని యీ నోటు సోమరాజే పడేసి వుంటాడు. వాడికి తను పాతనోటు యిచ్చాడే. ఈ కొత్త నోటు వాడికెలా వచ్చింది? ఎవరిచ్చారు? నోటు పరీక్షగా చూశాడు. గబగబా సోమరాజు యింటికి వెళ్ళాడు. పెద్ద లోగిలీ పాడుపడి వుంది. పిశాచం పట్టుకున్న ఇల్లని దీనిమీద ఎవరూ అప్పయినా ఇవ్వలేదు. పిల్చినా జవాబు లేదు. తిన్నగా చంద్రవంక ఇంటికి వెళ్ళాడు.

"ఈ నోటు సోమరాజు కెలా దక్కింది?"

"ఏ నోటు?"

"ఈ పది రూపాయల నోటు!''

"ఏమో, నాకేం తెలుసు?"

"నిజం చెప్పు. నీకు నేనిచ్చిన నోటు వాడికెలా వెళ్ళింది?"

"ఎన్ని నోట్లు లేవు. నాకిచ్చిన నోటని ఎలా చెప్పగలరు?"

"ఇదిగో, నీకెప్పుడూ కొత్త నోట్లే ఇచ్చాను. చూడు ఈమూల - చిన్న చంద్రవంక గుర్తు పెట్టాను."

"అయితే, నన్నెప్పుడూ మీరు నమ్మలేదన్నమాట!"

'నమ్మాను - నా కట్టుకున్న పెళ్ళాన్ని నమ్మలేదుగానీ నిన్ను నమ్మాను.''

"అయితే, ఈ గుర్తు లెందుకు? మీరిచ్చిన నోట్లన్ని నేను దాచుకోలేదు_ ఖర్చు పెట్టున్నాను."

"లేదు, నివ్వే ఆ సోమరాజుకి ఇచ్చావంటున్నాను. నిజమా కాదా చెప్పు?"

"అవును. ఇచ్చాను. నేనే ఇచ్చాను!" చంద్రవంక నిటారంగా నిల్చొని చెప్పింది.

''ఎందుకిచ్చావు?''

''మీకోసం ఎదురు చూస్తుంటే అతను వచ్చాడు. 'ఊర్లో అందర్ని అడిగాను. ఒకప్పుడు అందరూ నావల్ల బాగుపడ్డవాళ్ళే - మరచిపోయారు. అవసరం వుంది. ఒక్క పది రూపాయలు ఇస్తావా?'' అని ప్రాధేయపడ్డాడు. ఎందుకు అన్నాను. 'నా గడియారం గజపతికి పది రూపాయలకు తొందరలో అమ్మేశాను. అందులో నా శ్యామ గుండె వుంది. ఆ గుండె నా దగ్గర లేకపోతే

నా గుండె ఆగిపోతుంది. వాడి పది వాడి కిచ్చి నా శ్యామను తిరిగి తెచ్చు కుంటాను'' అన్నాడు. గడియారం అమ్మిన పదిరూపాయలు ఏం చేశారని అడిగాను. గురవయ్యవచ్చి ఇప్పుడు నేను నిన్ను అడిగినట్లే ప్రాధేయపడ్డాడు. నాలానే బతికి చెడినవాడు. మందు పొయ్యక పోతే పెళ్ళాం చస్తుంది. అది చస్తే యే నుయ్యో గొయ్యో చూసుకుంటా నన్నాడు. అంత విలువైన వస్తువును రక్షించడానికి అమ్మడాని కింకేం లేక నా గడియారాన్ని అమ్మేశాను. అమ్మేశాక ఒంటరితనం వచ్చింది, బతకలేక పోతున్నా'నన్నాడు. కనికరించి నోటు ఇచ్చాను. అంతే జరిగింది. దీనికేమో మీరు చిలవలు పలవలు వేసి ఇంతది అంత చేస్తున్నారు. మనిషికి విలువ కట్టడం మీకే చాతనౌతుంది లెండి!''

"అంతేనా?" అంటూ తిరిగి ఇంటికి వచ్చేశాడు. వచ్చినా ఒకచోట కూర్చోలేదు. ఒక పని చెయ్యలేదు. మళ్ళీ రాత్రి పరుపుమీద జారబడితే గడి యారం టిక్‌టిక్ మంటోంది. ఈవేళ ఏదేదో ఎత్తి పొడుస్తున్నట్లు ఆ గంటలు కొడ్తున్నాయ్. కాలం కదుల్తూ ఎన్నెన్నో ప్రశ్నలు! ఎన్నెన్నో అనుమానాలను రేపి మనస్సు నిండుగా కుళ్లను కుప్పలుగా పోస్తోంది. ఒక అబద్ధం ఆడగల ఆడది ఎన్ని అబద్ధాలైనా ఆడగలుగుతుంది. ఒక గుట్టు దాచగలిగినది ఎన్ని గుట్టులైనా దాచేస్తుంది. చంద్రవంకకూ తనకూ డబ్బే సంబంధాలను ఏర్పర చింది. డబ్బంటే దానికి వల్లమాలిన అపేక్ష. ఒకనాడూ ఆమె ఊరకనే ఒకరికి ఒక పైసా ఇవ్వలేదు. తనే అనుకుంటే తనకంటే ఆమెకు డబ్బు పిచ్చి హెచ్చు. ఆ పిచ్చితో అన్ని రుచులూ కూడిన వలపును నటించి, అరచేతిలో తనను పెట్టుకుంది. ఇలా ఆలోచిస్తుంటే నిద్దర పట్టలేదు. గుండె దడ హెచ్చింది. గబగబ లేచి చంద్రవంక ఇంటికి వెళ్ళాడు.

"నిజం చెప్పు. వాడు రాత్రిమీద యెందుకొచ్చాడు? ఇంకేం ఆడగలేదా?"

"అతనికి కావలసింది డబ్బు. అడిగి తీసుకపోయాడు."

"నీ బొంకు గోడ అనుకుంటున్నావు. నా దగ్గర నీ ఆటలు సాగవు. నిజం చెప్తావా? లేక...." రెండు చేతులు ఆమె మెడ దగ్గర పెట్టూ —

'చెప్పు....డబ్బుకు విలువకట్టి ఒక కాలు జార్చుకున్నాను. నిన్ను విలువ కట్టి రెండో కాలు జార్చుకుంటే చొట్టవాణ్ణి అవుతాను. చెప్పు - వాడేం చేశాడో చెప్పు" అంటూ వెనుకకు కదలి అంత దూరంలో నిల్చున్నాడు.

చంద్రవంక మంచం మీద కూర్చుంది. గంభీర స్వరంతోనే—

''అతనేం చెయ్యలేదు. నేనే చేశాను'' అంది.

"ఏం చేశావ్?"

ఆమె మెల్లగా ఆగి ఆగి నిబ్బరంగా అంటోంది :

"నాది - యీనాటి కోరిక కాదు. నిన్నటిది కాదు, ఈ వూర్లో కాలుపెట్టిన దగ్గరనించీ వున్న కోరిక. ఈ వూర్లో మనిషి అన్నవాడు వున్నాడంటే అతనే - ఆ సోమరాజే! ఆ మనిషితో కలుసుకునే అవకాశం ప్రతి ఆడదానికీ దొరకదు. మనిషన్న ప్రతివాడూ ఆడదాని దగ్గరకు రాగానే మృగం అయిపోతాడు. ఇన్ని యేళ్ళనించి వున్న నా కోరిక మొన్న రాత్రి అతను దేహీ అని రాగానే .... నా కోర్కెను తీర్చుకోకుండా పది రూపాయలిస్తానా? అతను కాదంటాడనుకున్నాను. మౌనంగా అంగీకరించాడు. ఒక్క మాట ఆడకండా, ఆ రాత్రంతా నా యెడారి లాంటి జీవితాన్ని నందనవనం చేసి వుదయాన్నే వెళ్ళిపోయాడు. అతనికి డబ్బు వదిలిపోయిందిగానీ మానవత్వం వదిలిపోలేదు. కలకాలం గుర్తుంచుకోడానికి ఒక్కరాత్రి అనుభవం - పవిత్రానుభవం...." చంద్రవంక కళ్ళల్లో నించి నీరు బొటబొటా కారుతున్నాయి. ఆ క్షణాలు బహుశః ఆనందపుటంచులు దాటిన మధుర క్షణాలు.

చంద్రవంకను చంపేయాలని నాలుగడుగులు ముందుకు వేశాడు. ఆమె ముఖంలో యెటువంటి బీభత్సం కనపడలేదు. చచ్చిపోయినా పోయిందేమీ లేదన్నట్లు చూస్తోంది,

"విశ్వాసంలేని కుక్క....వీధి కుక్క .... ఛీ .... " అని ఆమెపై వుమ్మి యింటికి ఆ రాత్రిమీదే పరుగెత్తాడు.

పరుపుమీద వాలి వెక్కి వెక్కి యేడ్చుకున్నాడు. శ్యామసుందరిమీద తన మమకారానికి కారణం ఆమెకు మగని వైపున్న విశ్వాసం. ఆ పతివ్రత యీ చంద్రవంకలో వుందనే యిన్నాళ్ళూ యింత విలువ కట్టాడు, ఈ పతివ్రత నేదో యీ గడియారంలో చూశాడు. అది టిక్ టిక్ మంటుంటే, గుండె వడి హెచ్చయి ఆగిపోతుందేమో ననిపించి పెండ్యులంను ఆపేశాడు. అయినా, ఆ శబ్దాలు మనసులో గింగురుమంటూ గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాయ్. వజ్రం గాజును ముక్కలు చెక్కలుగా కోస్తున్న ధ్వని అది.

"ఈ గడియారం లేకపోయినా కాలం నడుస్తుంది. నేను లేకపోయినా చంద్రవంక బతగ్గలుగుతుంది. నా విలువెంత? ఈ గోడ గడియారం విలువెంత? దేని విలువైనా యెంత?" అనుకొని గబగబ మంచమీద నిల్చొని గోడ గడియారాన్ని తీసి అలా నిల్చొనే యెత్తి కొట్టేశాడు.

*

(1975)